సాక్షి కామారెడ్డి

బుధవారం ॥ 18 ॥ డిసెంబర్ ॥ 2024



ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి

ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది.

- 8లో ▸

కేసులు ఎత్తేయాలి

లగచర్ల రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలంటూ బీఆర్‌ఎస్ నేతలు అంబేడ్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు ఇచ్చారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం **28.2 /6.9**

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి : అసెంబ్లీలో జుక్కల్ ఎమ్మెల్యే

నిజాంసాగర్ : నిజాంసాగర్ ప్రాజెక్టుతో పాటు కౌలాస్ కోట, రామేశ్వరం ఆలయాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. నిజాంసాగర్ ప్రాజెక్టును గత ప్రభుత్వాలు టూరిజం హబ్‌గా మారుస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టుతో పాటు కౌలాస్ కోటను పర్యాటకంగా తీర్చిదిద్దాలని కోరారు.

'జిల్లాలో రూ.140 కోట్ల విద్యుత్ బకాయిలు'

నాగిరెడ్డిపేట : జిల్లాలో రూ.140 కోట్ల విద్యుత్ బిల్లుల బకాయిలు ఉన్నాయని ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రవణ్‌కుమార్ తెలిపారు. నాగిరెడ్డిపేట మండలంలోని బంజర సెక్షన్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం మొత్తం 4.35 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. ఇందులో 1.12 లక్షల వ్యవసాయ కనెక్షన్లున్నాయన్నారు. జిల్లాలో ఏటా 3 వేలకు పైగా వ్యవసాయ కనెక్షన్లు ఇస్తున్నామని, ఇంకా 1,800 డీడీలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. బీపీఎల్ కింద రూ.975 చెల్లిస్తే విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నామన్నారు. ఈనెలాఖరు వరకు బీపీఎల్ కనెక్షన్ పొందేందుకు అవకాశం ఉందన్నారు. విద్యుత్ సిబ్బంది తప్పనిసరిగా స్థానికంగా ఉండాలన్నారు. స్థానికంగా ఉండని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనవెంట నాగిరెడ్డిపేట ట్రాన్స్‌కో ఏఈ నాగరాజు ఉన్నారు.

నేడు త్రైబంది సమావేశం

నాగిరెడ్డిపేట: యాసంగి పంటలసాగు కోసం పోచారం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసేందుకు ఆయకట్టు రైతులతో బుధవారం త్రైబంది సమావేశం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు, ఏఈ అక్షయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశానికి సంబంధించి పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో దండోరా వేయించాలని సూచించారు. ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టు రైతులతోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశానికి సకాలంలో హాజరుకావాలని కోరారు.

'పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి'

లింగంపేట : పశువైద్య శిబిరాలను రైతులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి సంజయ్ సూచించారు. మంగళవారం మోతె గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో పశువులకు వైద్య పరీక్షలు చేశారు. 85 గేదెలు, 18 ఆవులకు వైద్యచికిత్సలు నిర్వహించారు. 50 దూడలకు నట్టల నివారణ మందులు, 24 పశువులకు కృత్రిమ గర్భధారణ చేశారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజితారెడ్డి, వైస్ చైర్మన్ రాజు, పశువైద్యాధికారి హనాజోనస్, మోతె పాలకేంద్రం అధ్యక్షుడు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన టీఎన్జీవోస్ జిల్లా కార్యవర్గం

కామారెడ్డి అర్బన్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం మంగళవారం బాధ్యతలు స్వీకరించింది. జిల్లాకేంద్రంలోని హెడ్ పోస్టాఫీస్ పక్కన గల టీఎన్జీవో భవనంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి ముల్క నాగరాజు, అసోసియేట్ అధ్యక్షుడు ఎం.చక్రధర్, కోశాధికారి ఎం.దేవరాజులను ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు సన్మానించారు.

గజగజ

నిర్మానుష్యంగా ఉన్న నిజాంసాగర్ చౌరస్తా

- పంజా విసిరిన చలి పులి
- పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- వణుకుతున్న జిల్లావాసులు
- రాత్రి 8 దాటితే ఇళ్లకే పరిమితం అవుతున్న ప్రజలు

చలి మంట కాచుకుంటున్న రైల్వే ప్రయాణికులు

SAKSHI సాక్షి విజిట్ VISIT

కామారెడ్డి క్రైం : జిల్లాను చలి పులి వణికిస్తోంది. సాయంత్రం 5 గంటలకే చలి తీవ్రత మొదలవుతోంది. ఉదయం 10 గంటల వరకూ వణుకు తగ్గడం లేదు. రోజురోజుకు కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో జనం ఇబ్బందిపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా చలి తీవ్రత పెరిగిన నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి 12 గంటలనుంచి 2 గంటల వరకు 'సాక్షి' కామారెడ్డి పట్టణంలో నైట్ విజిట్ చేపట్టింది. కామారెడ్డి రైల్వే స్టేషన్, బస్టాండ్, నిజాంసాగర చౌరస్తా, స్టేషన్ రోడ్డు, సిరిసిల్ల రోడ్డు, హైదరాబాద్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని తెలుసుకుంది. చలి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జనం దాదాపుగా ఇళ్లకే పరిమితమయ్యారు. చాలాచోట్ల రోడ్లపై ఒక్కరు కూడా కనిపించలేదు. ఇతర సీజన్‌లలో బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతాలతోపాటు ప్రధాన కూడళ్ల వద్ద రాత్రి 12 గంటలకు సైతం జనసంచారం కనిపించేది. కానీ చలి ఎక్కువగా ఉండడంతో రోడ్లన్నీ పూర్తిగా నిర్మానుష్యంగా కనిపించాయి. రైల్వే స్టేషన్‌లో రైలు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు, కూలీలు చలి మంటలు కాచుకుంటూ కనిపించారు. ఇల్లులేని వారు, యాచకులు, అనాథలు స్టేషన్ రోడ్డులోని దుకాణాల ఎదుట నిద్రించారు. చాలీచాలని దుప్పట్లతో గజగజ వణుకుతున్న దృశ్యాలు కనిపించాయి.

దుకాణాల ముందు నిద్రిస్తున్న యాచకులు

నాలుగు రోజులుగా..

జిల్లాలో నాలుగు రోజులుగా చలి తీవ్రత పెరుగుతోంది. జుక్కల్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 6.9 డిగ్రీలుగా నమోదయ్యింది. జిల్లాలోని చాలా ప్రాంతాలలో కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీలలోపే నమోదవుతున్నాయి. సాయంత్రం 5 గంటలకే చలి పులి పంజా విసురుతోంది. చల్లని గాలులు వీస్తుండడంతో రాత్రి 8 గంటలు దాటితే జనం బయటికి రావడం లేదు. వెచ్చదనం కోసం ఉన్ని దుస్తులు ధరించడంతోపాటు ఉదయం, రాత్రి వేళల్లో చలిమంటలు వేసుకుంటున్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో తప్పనిసరి ప్రయాణాలు చేయాల్సిన వారు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. పెరిగిన చలి కారణంగా ప్రజలు చాలామంది అనారోగ్యం పాలవుతున్నారు. జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రులకు వెళ్తున్నవారి సంఖ్య పెరుగుతోంది. చలి వల్ల వృద్ధులు, చిన్నారులు ఎక్కువగా అనారోగ్యాల బారిన పడే అవకాశాలు ఉంటాయని వైద్యులు పేర్కొంటున్నారు. వారి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

జిల్లాలో మంగళవారం నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు.. (డిగ్రీలలో)

లొకేషన్	ఉష్ణోగ్రత				
		దోమకొండ	8.9	ఆర్గొండ	9.8
జుక్కల్	6.9	ఎల్పుగొండ	9.0	డోంగ్లీ	10.4
మేనూర్	7.4	బీబీపేట	9.1	పెద్దకొడప్‌గల్	10.5
బిచ్కుంద	8.2	పుల్కల్	9.1	పాతరాజంపేట	10.6
రాంలక్ష్మణ్‌పల్లి	8.4	సోమూర్	9.3	నస్రుల్లాబాద్	10.8
సర్వాపూర్	8.4	లచ్చాపేట్	9.3	కొల్లూర్	11.0
లింగంపేట్	8.7	నాగిరెడ్డిపేట్	9.4	రామారెడ్డి	11.1
మగ్దుంపూర్	8.7	ఇసాయిపేట్	9.6	భిక్కనూరు	11.5
గాంధారి	8.8	బీర్కూర్	9.6	తాడ్వాయి	11.9
మాచాపూర్	8.8	హసన్‌పల్లి	9.6	సదాశివనగర్	13.3
పిట్లం	8.9	బొమ్మన్‌దేవ్‌పల్లి	9.7	కలెక్టరేట్	14.4

నిర్మానుష్యంగా ఉన్న కామారెడ్డి రైల్వే స్టేషన్ ఆవరణ

జన సంచారం లేని స్టేషన్ రోడ్డు

ఇంటిపన్నులే పంచాయతీలకు ఆసరా!

వసూళ్ల లక్ష్యం రూ. 11 కోట్లు..

- ఇప్పటికి వసూలయ్యింది రూ. 2.53 కోట్లు
- సర్వేలతో ఆటంకం..
- వేగవంతం చేయాలని సూచిస్తున్న అధికారులు

వెంకంపల్లిలో ఇంటిపన్నులు వసూలు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి రజిత

నాగిరెడ్డిపేట: గ్రామపంచాయతీలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ పద్దుల కింద నిధులు విడుదల కాకపోవడంతో ట్రాక్టర్ల నిర్వహణతోపాటు పారిశుధ్య నిర్వహణ, గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాల చెల్లింపుల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వాలు గ్రామపంచాయతీలకు జనాభా ఆధారంగా నిధులను విడుదల చేస్తాయి. అయితే పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం పూర్తి కావడం, కొత్త పాలకవర్గాలు ఏర్పాటు కాకపోవడం వంటి కారణాలతో కేంద్రం నుంచి నిధులు రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఆశించిన స్థాయిలో నిధులివ్వకపోవడంతో పంచాయతీలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ పరిస్థితులనుంచి ఊరట చెందడానికి ఇంటి పన్నులే ఆధారం కానున్నాయి.

వందశాతం వసూళ్ల కోసం..

ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో రూ.11 కోట్ల పన్నులు వసూలు చేయాలన్నది లక్ష్యం. ఇప్పటివరకు రూ. 2.53 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. ఇంకా రూ.8.47 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. పంచాయతీ కార్యదర్శులపై రకరకాల సర్వేల భారం మోపుతున్నారు. దీంతో పన్నుల వసూళ్లపై దృష్టి సారించలేకపోతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంటల సాగు పూర్తయి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. ఈ నేపథ్యంలో పన్నుల వసూళ్లను వేగవంతం చేయడంపై అధికారులు దృష్టి సారించారు. పంచాయతీ కార్యదర్శులు సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరుగుతూ పన్నులను వసూలు చేస్తున్నారు. వంద శాతం పన్నులు వసూలు చేయాలన్న లక్ష్యంతో సాగుతున్నారు.

పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలి

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంటల సాగు పూర్తయ్యింది. రైతులకు ధాన్యం డబ్బులు అందాయి. ఈ నేపథ్యంలో పంచాయతీ సిబ్బంది పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలి. మార్చిలోగా వంద శాతం పన్నులు వసూలు చేయాలి.

– సురేందర్, డీఎల్‌పీవో, ఎల్లారెడ్డి

చెరువు అలుగు వద్ద రోడ్డు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

కాజ్‌వే నిర్మించరూ..

సదాశివనగర్ మండలం అమర్లబండ, తాడ్వాయి మండలం కన్కల్ గ్రామాల మధ్య రాకపోకల కోసం రోడ్డు నిర్మించారు. మధ్యలో చెరువు అలుగు ప్రాంతంలో వంతెన కాని, కాజ్‌వే కాని లేదు. దీంతో బండరాళ్లపైనుంచే వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి. కాజ్‌వే లేదా వంతెన నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

–సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

'రైతుల సమస్యలు పరిష్కరిస్తాం'

బిచ్కుంద : తూకం వేసి పంపించిన సోయాలలో నాణ్యత లేదంటూ బోధన్ గోదాం నుంచి తిప్పి పంపించిన సోయా రైతుల సమస్య పరిష్కరిస్తామని డీసీవో రామ్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం బిచ్కుంద సొసైటీలో సోయా రైతులతో డీసీవో, మార్క్‌ఫెడ్ ఎండీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బస్తాలు విప్పి సోయా గింజలలో నాణ్యత పరిశీలిస్తామని, వాటిని తప్పకుండా కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. అధికారులు పూర్తి స్థాయిలో సోయాల నాణ్యత, తేమ శాతం పరిశీలించిన తర్వాతే తూకం వేయాలని సూచించారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ నాల్చర్ బాలాజీ, కార్యదర్శి శ్రావణ్, రైతులు పాల్గొన్నారు.

రైతులతో సమావేశమైన అధికారులు

ఆక్రమణలపై కొరడా

కామారెడ్డి టౌన్: అక్రమ కట్టడాలపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌కే లాడ్జి రోడ్, జన్మభూమిరోడ్, ఎన్జీవోస్ కాలనీలలో రోడ్లకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించే పనులు చేపట్టారు. పొక్లెయిన్‌లతో మురికి కాలువపై అక్రమ నిర్మాణాలు, రేకుల షెడ్లను కూల్చివేశారు. రోడ్లను ఆక్రమించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టీపీవో గిరిధర్ హెచ్చరించారు. ఈ ఆక్రమణలతో రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆక్రమణలను తొలగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌చార్జి ఎస్సై పర్వేజ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌కే లాడ్జి రోడ్‌లో పొక్లెయిన్‌తో అక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

పక్కాగా ఇందిరమ్మ సర్వే నిర్వహించాలి

- యాప్‌లో అన్ని వివరాలు పొందుపరచాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

భిక్కనూరు: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ఆయన మంగళవారం అంతంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, దరఖాస్తుదారుల పూర్తి సమాచారాన్ని సేకరించి యాప్‌లో పొందుపరచాలని సూచించారు. ప్రస్తుతం నివసిస్తున్న ఇల్లుతో పాటు దరఖాస్తుదారుల ఫొటో, ఇంటి పన్ను రశీదులను యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ఇంటి స్థలం డ్యాక్‌మెంట్లను కూడా యాప్‌లో పొందుపరచాలన్నారు. ఇళ్లు లేని వారి జీవనస్థితిగతులను తెలుసుకున్నారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి రజిత, డీఎల్‌పీవో శ్రీనివాస్, తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి తదితరులున్నారు.

అంతంపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

విద్యార్థులకు అభినందనలు..

కామారెడ్డి క్రైం : ఆదిలాబాద్‌లో ఈనెల 14 నుంచి 16 వరకు నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబురాల్లో జిల్లాకు మూడో స్థానం లభించింది. లింగంపేట్ మైనారిటీ బాలుర గురుకుల విద్యార్థులు తృతీయ బహుమతి పొందారు. వారు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. బహుమతి సాధించిన రాహుల్, అబ్దుల్ రహమాన్, ముఖేష్‌లను కలెక్టర్ సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని అద్భుతమైన విజయాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి దయానంద్, డీఈవో రాజు, ఆర్‌ఎల్‌సీ కిరణ్ గౌడ్, పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ, స్కూల్ కోఆర్డినేటర్ రామ్‌గోపాల్, గైడ్ టీచర్ మల్లేశ్ పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్‌లో నీటిని పట్టుకుంటున్న ప్రజలు

తాగునీటి కష్టాలు

పెద్దకొడప్‌గల్ : మండలానికి మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. దీంతో వారం రోజులుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో పంచాయతీ వాటర్ ట్యాంక్‌లతో నీటిని సరఫరా చేస్తున్నారని, కానీ ఆ నీరు సరిపోవడం లేదు. దీంతో ప్రజలు సమీపంలోని పొలాలనుంచి తాత్కాలికంగా పైప్‌లైన్ ఏర్పాటు చేసుకుని నీటిని పట్టుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

పది నెలలనుంచి సమస్య..

మా తండాకు 10 నెలల నుంచి మిషన్ భగీరథ నీరు రావడంలేదు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. నీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. రోజూ తాగు నీరందేలా చూడాలి. – జగదీష్, కుబ్యానాయక్ తండా వాసి

రేపటినుంచి నీరందిస్తాం

మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు రెండు మూడు చోట్ల భారీ లీకేజీలు ఏర్పడడంతో సమస్య తలెత్తింది. వారం రోజులుగా మరమ్మతులు చేయిస్తున్నాం. పనులు పూర్తయ్యాయి. రేపటినుంచి నీటిని సరఫరా చేస్తాం.

– కౌశిక్, డీఈ, మిషన్ భగీరథ

కుబ్యానాయక్ తండాలో పొలాల నుంచి వేసిన పైప్ ద్వారా నీటిని పట్టుకుంటున్న స్థానికులు

క్లుప్తంగా

సీఎం కప్ పోటీల్లో మండల జట్ల ప్రతిభ

బీబీపేట: సీఎం కప్ పోటీలలో భాగంగా జిల్లా స్థాయిలో మంగళవారం నిర్వహించిన మహిళా కబడ్డీ పోటీలలో బీబీపేటకు చెందిన మహిళా జట్టు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. వీరు రాష్ట్ర స్థాయిలో కబడ్డీ పోటీలలో ఆడనున్నారు. మాందాపూర్‌కు చెందిన పవన్, దత్తారెడ్డిలు 3 కి.మీ పరుగు పందెంలో జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించారు.

మద్నూర్ గురుకుల విద్యార్థులకు బహుమతులు

మద్నూర్(జుక్కల్): జిల్లా యువజన క్రీడా అధికారి జగన్నాథం, జిల్లా అథ్లెటిక్స్ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ చేతుల మీదుగా మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు బహుమతులు అందుకున్నారని సోమవారం గురుకుల ప్రిన్స్‌పాల్ గంగాకిషోర్, పీఈటీ జాదవ్ గణేష్‌లు తెలిపారు. సీఎంకప్ పోటీలలో భాగంగా పరుగు పందెం విభాగంలో జగదీశ్ బంగారు పతకం, రుతిక్ వెండి పతకం, అరవింద్ క్యాంస పతకం.. షటిల్ బ్యాడ్మింటన్ జూనియర్ డబుల్స్ విభాగంలో చరణ్, జ్ఞానదీప్ వెండి పతకాలు, లాంగ్ జంప్‌లో శశికుమార్ వెండిపతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ చెప్పారు. ఉపాధ్యాయులు, విజేతలను అభినందించారు.

బేస్‌బాల్ పోటీలు ప్రారంభం

దోమకొండ: మండల కేంద్రంలోని దుబ్బ బంగ్లాలో మంగళవారం బేస్ బాల్ పోటీలను ప్రారంభించారు. మండలానికి చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జ్యోతి, జిల్లా స్పోర్ట్స్ అధికారి జగన్నాథం, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ సంజయ్ రావు, మాజీ జెడ్పీటీసీ తీగల తిరుమల గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ గోపాల్ రెడ్డి, నాయకులు శంకర్ రెడ్డి, గడికోట మేనేజర్ బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల నిర్లక్ష్యంతోనే ఠాణాలో ఆత్మహత్య !

- నైట్ ప్యాంట్ నాడాతో ఉరివేసుకున్న నిందితుడు
- కొనసాగుతున్న జుడీషియల్ విచారణ

రెంజల్ (బోధన్)/ఖలీల్‌వాడి: మతిస్థిమితం లేని ఏడేళ్ల బాలికపై లైంగిక దాడి చేసిన నిందితుడు పోలీసుల నిర్లక్ష్యం వల్లే స్టేషన్‌లో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. విశ్వసనీయ వర్గాలు అందించిన సమాచారం మేరకు ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలంలోని ఓ గ్రామంలో మతిస్థిమితంలేని బాలిక పై అత్యాచారం చేశాడని నిందితుడు రత్నావత్ రెడ్యాపై బాలిక బంధువులు దాడి చేసి చితక బాదారు. స్థానికులు డయల్ 100కు కాల్ చేయగా రెంజల్ పోలీసులు గ్రామానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన రెడ్యాను ఆస్పత్రికి తరలించారు. వైద్యులు తలకు నాలుగు కుట్లు వేసి ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం పోలీసులు అర్ధరాత్రి రెండున్నర గంటలకు రెడ్యాను తిరిగి రెంజల్ స్టేషన్‌కు తీసుకు వచ్చారు. ఇంటరాగేషన్ అనంతరం ఎస్సై, సీఐలు అతన్ని లాకప్ పక్క గదిలో పెట్టి నైట్ డ్యూటీలో ఉన్న కానిస్టేబుళ్లకు బాధ్యతలు అప్పగించి వెళ్లారు. అయితే నైట్ డ్యూటీలో ఉన్న పోలీసులు నిద్రకు ఉపక్రమించడంతో రెడ్యా నైట్ ప్యాంటు నాడాతో స్టేషన్‌లోని కిటికీకి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. తెల్లవారుజామున నాలుగు గంటలకు గుర్తించిన పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి రెడ్యా మృతదేహాన్ని తిరిగి ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలుస్తోంది. అప్రమత్తమైన పోలీసు ఉన్నతాధికారులు మరోవైపు అల్లర్లు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా భారీ బలగాలతో గ్రామానికి చేరుకున్నారు. రెడ్యాపై దాడిచేసిన 11 మందిని నిద్ర నుంచి మేల్కొలిపి అదుపులోకి తీసుకుని గ్రామం నుంచి తరలించారు. వివిధ పోలీసు స్టేషన్‌లలో ఉంచిన వీరిని అదుపులోకి తీసుకుని ఐదు రోజులు గడుస్తున్నా కోర్టులో హాజరు పర్చలేదు. రెడ్యా మృతదేహాన్ని రెండో రోజు సాయంత్రం ఆరు గంటలకు కుటుంబ సభ్యులకు అందించారు. రెడ్యా మృతిపై విచారణ చేపట్టిన మెదక్ జిల్లా తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి మూడు రోజులుగా బోధన్‌లో ఉండి విచారణ చేస్తున్నట్లు సమాచారం. జిల్లా న్యాయమూర్తి పోలీస్ స్టేషన్‌లో ఆత్మహత్య ఘటనపై జ్యుడీషియల్ విచారణకు ఆదేశించడంతో మేజిస్టీరియల్ విచారణ కూడా జరుగుతోంది. ఇప్పటికే పోస్ట్ మార్టంకు సంబంధించిన అంశాలు, ఘటన వివరాలను సేకరించినట్లు తెలుస్తోంది. పోస్టుమార్టం నివేదిక ప్రకారం చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నట్లు అధికారుల ద్వారా తెలిసింది. పోలీసులు డాక్టర్లతో మాట్లాడి ఇష్యూ బయటకు రాకుండా చేయడానికి ప్రయత్నించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రత్నావత్ రెడ్యా(ఫైల్)

రెంజల్ పోలీస్ స్టేషన్‌లో నిందితుడు ఉరి వేసుకున్న ఘటనపై సీఐ, ఎస్సై, సిబ్బందిని ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ మందలించినట్లు సమాచారం. ప్రొఫెసర్ డాక్టర్ నాగమోహన్ ను పోస్టుమార్టం కోసం వివరణ కోరగా జ్యుడీషియల్ విచారణ కొనసాగుతోందని, దీనిపై ఇప్పుడు ఏమీ మాట్లాడలేమని స్పష్టం చేశారు.

వినియోగదారులకు అండగా ఉంటాం

- విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ ఎరుకల నారాయణ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): విద్యుత్ వినియోగదారులకు తమ ఫోరం అండగా ఉండి వారి విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ ఎరుకల నారాయణ పేర్కొన్నారు. మండలంలోని బంజర సెక్షన్ కార్యాలయం వద్ద మంగళవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతినెలా ఒక మండలంలో విద్యుత్ వినియోగదారుల ఫోరం ఆధ్వర్యంలో సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. రైతులతోపాటు ఇతర విద్యుత్ వినియోగదారులు తమ ఫోరంతోపాటు ట్రాన్స్‌కో అధికారులు నిర్వహించే ప్రజావాహిని, పొలంబాట కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. నాగిరెడ్డిపేటలో 15 ఫిర్యాదులు రాగా వాటిలో 7 ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించామని, మిగిలిన 8 ఫిర్యాదులను రాతపూర్వకంగా స్వీకరించామన్నారు. విద్యుత్ వినియోగదారుల ఫోరం టెక్నికల్ విభాగం సభ్యులు సలంద్ర రామకృష్ణ, ఫైనాన్స్ సభ్యులు లకావత్ కిషన్, ఫోర్త్ మెంబర్ మర్రిపల్లి రాజాగౌడ్, ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రవణ్‌కుమార్, ఇన్‌చార్జి డీఈఈ నాగరాజు, ఇంచార్జీ ఏఈ నాగరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎరుకల నారాయణ

పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రచురణ

నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో జాబితాను ప్రచురిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో ఓటర్ల జాబితాను విడుదల చేస్తున్న ఎంపీడీవో ప్రకాష్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల తుది జాబితాను మంగళవారం నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ప్రచురించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి కార్యాలయ సిబ్బందితో కలిసి పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రచురించారు. మండలంలో మొత్తం 232 పోలింగ్ కేంద్రాలున్నాయని, వాటి పరిధిలో మొత్తం 25,606మంది ఓటర్లుండగా వారిలో 11,927 మంది పురుషులు, 13,679 మంది మహిళా ఓటర్లున్నారని ఎంపీడీవో తెలిపారు.

ఓటర్ల జాబితా విడుదల

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని 31 జీపీలకు సంబంధించిన ఓటర్ల జాబితాను మంగళవారం ఎంపీడీవో ప్రకాష్ విడుదల చేశారు. ఓటర్ల జాబితాకు సంబంధించి మార్పులు, చేర్పుల అనంతరం ఫైనల్ జాబితాను విడుదల చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. సిబ్బంది మల్లేష్ తదితరులున్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

రాజంపేట: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో అయ్యప్పస్వాములు ఆధ్వర్యంలో 21వ అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకాలు, మెట్ల పూజ నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన భజన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం అయ్యప్ప స్వామిని ప్రత్యేకంగా అలంకరించి వీధుల్లో ఊరేగించారు. పూజారులు కన్నయ్య పంతులు, పీవీ రాజు, గౌరీనాథ్ శర్మ పంతులు, అయ్యప్పమాలధారులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని పెన్షనర్స్ భవనంలో సోమవారం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మెడివిజన్ కంటి ఆస్పత్రి వైద్యులు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కంటి వైద్య నిపుణుడు దీప్‌సింగ్ 64 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అందులో నలుగురికి ఆపరేషన్ కోసం ఇతర ఆస్పత్రికి రిఫర్ చేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

సమ్మె శిబిరం ముందు చిత్రాలు గీస్తూ నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కోనాపూర్‌లో మద్దతు తెలుపుతున్న ఉపాధ్యాయులు

- 8వ రోజుకు చేరుకున్న సమ్మె

కామారెడ్డి టౌన్: తమ డిమాండ్‌లను నెరవేర్చాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె మంగళవారంతో 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. నిజాంసాగర్ చౌరస్తాలో మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. అనంతరం సమ్మె శిబిరం ముందు వారి బాధలు తెలిసేలా రోడ్డుపై చిత్రాలు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమను క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ఉద్యోగులు వాసంతి, హరిప్రియ, రాణి, సంపత్, దినేష్, మాధవి, శంకర్, సంతోష్‌రెడ్డి తదితరులున్నారు.

సమ్మెకు పలువురి మద్దతు

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవరెడ్డి, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, జిల్లా నాయకులు చరణ్, సత్యనారాయణ, రాజేశ్వర్‌రావు, ఎస్జీటీ ఉపాధ్యాయులు పద్మ, లక్ష్మి, శ్రీదేవి, సరిత, లావణ్య తదితరులు సమ్మెకు మద్దతు తెలిపారు. ప్రభుత్వ స్పందించాలని వారు డిమాండ్ చేశారు.

బాన్సువాడలో ప్రభుత్వ ఉపాధ్యాయులు..

బాన్సువాడ రూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగులకు బాన్సువాడ మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు మద్దతు తెలిపారు. మంగళవారం కోనాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో క్లస్టర్ స్థాయి సమావేశం సందర్భంగా వారు ప్లకార్డులు ప్రదర్శించి సంఘీభావం తెలిపారు. ప్రధానోపాధ్యాయులు శేఖర్, ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్, ఉపాధ్యాయులు షాహెద్, ప్రవీణ్, సాయిరాం, రాధ, విజయ్, హీరాలాల్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కామన్ డైట్ ఇబ్బందులను తొలగించాలి

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో కామన్ డైట్ అమలు ఇబ్బందులను తొలగించాలని టీఎన్జీవోస్ యూనియన్, తెలంగాణ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్(టీహెచ్‌డబ్ల్యూవో) ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్ రెడ్డి, టీహెచ్‌డబ్ల్యూవో ఫోరం జిల్లా అధ్యక్షుడు మామిండ్ల చక్రధర్ మాట్లాడుతూ..ప్రస్తుత పరిస్థితులను కలెక్టర్‌కు వివరించారు. హాస్టల్ సంక్షేమ అధికారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. టీఎన్జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముల్క నాగరాజు, కోశాధికారి దేవరాజు, ఉపాధ్యక్షులు సాయిలు, లక్ష్మణ్, టీహెచ్‌డబ్ల్యూవో ఫోరం కార్యదర్శి శ్రీనివాస్,తదితరులుపాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

సంక్షిప్తం

భగవద్గీత పుస్తకాల పంపిణీ

లింగంపేట(ఎల్లారెడ్డి): ముంబోజిపేట తండా, కొండాపూర్ తండాలో మంగళవారం భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేసినట్లు గిరిజన యువకుడు బానోత్ నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువతలో ఆధ్యాత్మికత పెంచడానికి తన వంతుగా పుస్తకాలు అందజేసినట్లు పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ భగవద్గీత పఠనం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఆయన వెంట వెంకట్రామ్, శివ, ఆత్మారామ్, తండావాసులు ఉన్నారు.

మహిళా సంఘాలకు స్త్రీనిధి రుణాలు..

రాజంపేట: మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మండలంలో మంగళవారం ఐకేపీ డీపీఎం ఆధ్వర్యంలో సంఘ సభ్యులకు స్త్రీనిధి రుణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం సాయిలు, సీసీ శ్రీనివాస్, వీవోఏలు, గ్రామ సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

భిక్కనూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయానికి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పురాం రాజమౌళి మంగళవారం రూ.20 వేల విలువ చేసే పుస్తకాలను బహూకరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము కోరిన వెంటనే స్పందించి రూ.20 వేల విలువ చేసే పుస్తకాలను అందించడం అభినందనీయమన్నారు. కాంపిటేటీవ్ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందించడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా దాత రాజమౌళిని శాలువాతో సత్కరించారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

రాజంపేట: మండల కేంద్రంలో జరుగుతున్నటు ఇందిరమ్మ ఇళ్ల సర్వేను జిల్లా పరిషత్ సీఈవో చందర్ నాయక్ పరిశీలించారు. లబ్ధిదారులు వివరాలను త్వరితగతిన ఆన్‌లైన్‌లో నమోదు చేసి సర్వేను వేగిరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో రఘురాం, పంచాయతీ కార్యదర్శి అశోక్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేలో వివరాలు పక్కాగా ఉండాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న సర్వేలో వివరాలు పక్కాగా ఉండాలని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు. మంగళవారం ఆయన లింగంపేట మండలంలోని బాణాపూర్, బాణాపూర్‌తండా, కోర్పోల్, బాయంపల్లి, మెంగారం గ్రామాల్లో పంచాయితీ కార్యదర్శులు నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఎంపీడీవో నరేష్ ఉన్నారు.

క్రైం కార్నర్

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

బాల్కొండ: అనారోగ్య సమస్యలతో అప్పుల పాలైన ఓ వ్యక్తి జీవితంపై విరక్తితో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ముప్కాల్ మండలం రెంజర్లలో చోటు చేసుకుంది. ముప్కాల్ ఏఎస్సై గంగారాం మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. రెంజర్ల గ్రామానికి చెందిన రహీం(50) కాలికి తగిలిన గాయాలతో అనారోగ్యానికి గురయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స కోసం ఖర్చు చేశాడు. గ్రామంలో చికెన్ సెంటర్ నిర్వహించి నష్టపోయాడు. దీంతో అప్పులు పెరగడంతో మనస్థాపానికి గురైన రహీం తన ఇంటి సమీపంలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

రుద్రూర్: కోటగిరి పీఎస్ పరిధిలోని పోతంగల్ మండలం కొల్లూర్ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ మంగళవారం తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించి టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, మొరం తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై అనిల్ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తండా చౌరస్తాలోని కో ఆపరేటివ్ బ్యాంక్ సమీపంలో మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడికి చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిపారు. మృతుడి వయస్సు 55 ఏళ్ల వరకు ఉంటుందని అన్నారు. మృతదేహం పక్కన మద్యం బాటిళ్లు ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు వివరాలు అందించాలని కోరారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

నవీపేట: మండలంలోని యంచ గ్రామానికి చెందిన రొడ్డ పోసాని(63) అనే వృద్ధురాలు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. ఈనెల 13న తన రేకుల ఇంట్లో చలి తీవ్రతను తట్టుకోలేక మంట కాచుకుంటుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుంది. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి సోదరి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పోస్ట్‌మన్ నిధుల దుర్వినియోగంపై కేసు

ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వేస్టేషన్ పరిధిలో ఉన్న పోస్టాఫీస్ నిధులను దుర్వినియోగం చేసిన పోస్ట్ మన్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పోస్టాఫీసులో పనిచేసే పోస్టుమాస్టర్ ఐపీబీఎం అకౌంట్ ద్వారా రూ. 11,55,000 నగదును దుర్వినియోగం చేసినట్లు తెలిపారు. దీంతో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

అనారోగ్యంతో మాజీ పట్వారి మృతి

రాజంపేట: అనారోగ్యంతో రాజంపేట మాజీ పట్వారి సత్యం పటేల్ మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అతను సోమవారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పలువురు రాజకీయ నాయకులు, గ్రామపెద్దలు, గ్రామస్తులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

లింగంపేట: మండల కేంద్రంలోని కొత్వాల్‌గల్లీలో మంగళవారం తెల్లవారుజామున తాళం వేసిన రెండు ఇళ్లలో దుండగులు చోరీ చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రియాజ్ నివాస గృహంలో బీరువాలో దాచిన వెండి వస్తువులు, నగదు, పట్టు చీరలు, అపహరించినట్లు తెలిపారు. అలాగే జావిద్ నివాస గృహంలో బీరువాను ధ్వంసం చేసి బంగారు గొలుసు, కమ్మలు, రూ. 14 వేలు నగదు చోరీ చేసినట్లు పేర్కొన్నారు. ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి చోరీకి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. అనంతరం మండలంలోని పర్మళ్లలో సైతం చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన గంట బాలమణి ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. అరతులం బంగారం, వెండి ఉంగరాలు, పట్టగొలుసులు అపహరణకు గురైనట్లు తెలిపారు. చోరీ జరిగిన విషయాన్ని బాధితులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. దుండగులు తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసి చోరీకి పాల్పడినట్లు స్థానికులు వెల్లడించారు.

రియాజ్ ఇంట్లో చిందర వందరగా చేసిన వస్తువులు

దేవునిపల్లిలో..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో బాలరాజు అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. దేవునిపల్లి గ్రామానికి చెందిన బాలరాజు బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లగా అతడి ఇంటికి తాళం వేసి ఉండడంతో దొంగలు సోమవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న 80 తులాల వెండిని చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో పలువురికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి ఒక రోజు జైలు శిక్షను సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్‌జాన్ విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ మంగళవారం పేర్కొన్నారు. డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించి జడ్జి ఎదుట హాజరు పర్చినట్లు తెలిపారు. ఇందులో 9మందికి రూ.13,500 జరిమానా విధించగా, గౌతంనగర్‌కు చెందిన ఎండీ అనీఫ్‌కు జడ్జి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

నాలుగో టౌన్ పరిధిలో..

నగరంలోని నాలుగో టౌన్ పీఎస్ పరిధిలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో ఇద్దరికి జైలు శిక్షను జడ్జి విధించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గాయత్రీనగర్‌కు చెందిన అంగూర్ రాకేశ్‌కు రెండు రోజులు, జెండాగల్లీకి చెందిన ఉప్పరి గోపాల్‌కు ఒక రోజు జైలును జడ్జి విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అర్ధరాత్రి హోటళ్లు, బేకరీలు తెరిచిన వ్యక్తులకు..

ఖలీల్‌వాడి: అర్ధరాత్రి వరకు హోటళ్లు, బేకరీలు తెరిచి ఉంచిన వ్యక్తులకు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జైలు శిక్షను విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని అర్ధరాత్రి వరకు షాపులు తెరిచి ఉంచిన ఒలంపియా బేకరీ నిర్వాహకుడు షేక్ అమాన్‌కు రెండు రోజులు, కొజ్జా కాలనీలో స్టార్ హోటల్ నిర్వాహకుడు షేక్ అస్లాం, తిలక్‌గార్డెన్ వద్ద ఉన్న న్యూ ప్యారడైస్ హోటల్ నిర్వాహకులు అత్తూర్ మియా, అస్లాంకు ఒకరోజు చొప్పున జైలు శిక్షను జడ్జి విధించారు. జిల్లా కేంద్రంలో ఎవరైనా ప్రభుత్వం విధించిన సమయంలోపు దుకాణాలు తెరిచి ఉంచితే తగు చర్యలు తప్పవని ఎస్‌హెచ్‌వో హెచ్చరించారు.

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్ట్

లింగంపేట: గంజాయి సాగు చేస్తూ విక్రయిస్తున్న ఆరుగురిని పట్టుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మంగళవారం స్థానిక పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని రాంపల్లి కొన తండాకు చెందిన దేవసోత్ శంకర్ ఇంటి వద్ద గంజాయి సాగు చేస్తూ విక్రయించేవాడు. శంకర్ సాగు చేసిన గంజాయి మండలంలోని బాయంపల్లి గ్రామానికి చెందిన అంబెపు సతీశ్, కొర్పోల్ గ్రామానికి చెందిన పాట్లోళ్ల ఆస్టిన్‌కు ఇవ్వగా వారు విక్రయించేవారని తెలిపారు. సతీశ్, ఆస్టిన్‌ల స్నేహితులు కామారెడ్డికి చెందిన పిడుతల శ్రీకాంత్, అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన ఇంద్రసేనారెడ్డి, కామారెడ్డి పట్టణానికి చెందిన బట్టు సాయికృష్ణకు విక్రయించే వారని పేర్కొన్నారు. వీరు రాంపల్లి కొన తండాకు గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చినట్లు సమాచారం అందడంతో సోమవారం సాయంత్రం రాంపల్లి కొనతండాలో పట్టుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి 6 సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు, 1315 గ్రాముల ఎండు గంజాయి, ఒక గంజాయి మొక్క స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొటోకాల్ కావాలా.. అభివృద్ధి కావాలా?

మాచారెడ్డి: కామారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి కావాలో.. ప్రొటోకాల్ కావాలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తేల్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ పాల్వంచ మండల అధ్యక్షుడు పల్లె రమేష్ గౌడ్ హితవు పలికారు. మంగళవారం పాల్వంచలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి ప్రజలు రోగాల బారిన పడుతుంటే మీరు ఎమ్మెల్యే అయి ఉండి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. స్థానిక సమస్యలను వదిలి మూసీ నది గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. అసెంబ్లీ సమావేశాలలో నాకు ప్రొటోకాల్ కావాలి అని అడగడం మరింత దారుణమని విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. నాయకులు సమరసింహారెడ్డి, గంగయ్య, భూమయ్య, బాసెట్టి సత్యం, అంజయ్య, రాజు, తిరుపతి పాల్గొన్నారు.

'యువత సినిమాలతో, పెడదోవ పట్టొద్దు'



కామారెడ్డి అర్బన్: ప్రస్తుతం ఎలాంటి సందేశం లేకుండా వస్తున్న సినిమాలతో యువత పెడదోవపట్టడం, చివరకు ప్రాణాల మీదకు తెచ్చుకోవడం జరుగుతోందని, నేటి సినిమాల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఇంపాక్ట్ ట్రైనర్, మోటివేషనల్ స్పీకర్ రమేష్ చైతన్య అన్నారు. పట్టణ పరిధిలోని దేవునిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం 'జీవితంలో లక్ష్యాలు-సవాళ్లు' అనే అంశంపై రమేష్ చైతన్య మాట్లాడారు. జీవితంలో లక్ష్యాలను చేరుకునే క్రమంలో తొలుత సెల్‌ఫోన్లు, మత్తు పదార్థాలను దాటుకుని రావాలన్నారు. హెడ్‌మాస్టర్ గంగాకిషన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సరస్వతి ఆలయ వార్షికోత్సవం

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని ఇల్చిపూర్ సరస్వతి మహా క్షేత్రం అష్టమ వార్షికోత్సవాలు బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు దత్తురావు, విజయపాండేలు తెలిపారు. ఆధ్యాత్మిక ప్రవచనాలుంటాయని వారు పేర్కొన్నారు.